క్లుప్తంగా

కల్యాణం .. కమనీయం



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీన్నసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ బేడామండపంలోని వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణ ధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

కళ్లద్దాల పంపిణీ



కళ్లద్దాలు అందిస్తున్న సర్పంచ్ గొరపల్లి శ్రీను

పెందుర్తి: ఇటీవల పెందుర్తి మండలం గొరపల్లిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో గుర్తించిన వారికి మంగళవారం గొరపల్లి గ్రామ సచివాలయంలో సర్పంచ్ గొరపల్లి శ్రీను చేతుల మీదుగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమణ, సచివాలయ, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ఆందోళన

పెందుర్తి: తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ మంగళవారం అంగన్‌వాడీలు ధర్నా చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తల గౌరవ సలహాదారు కొలంకి బృందావతి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా సమస్యలు పరిష్కారం కాకుండా ఉన్నాయన్నారు. ప్రభుత్వం తక్షణమే వాటిని పరిష్కరించాలని కోరారు. సమస్యలు పరిష్కారం కాకపోతే ఈ నెల 8 నుంచి నిరవధిక సమ్మె చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు లెక్కల దేవి, భవాని తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ బహిరంగ సభను విజయవంతం చేయండి



అంబేడ్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న కృష్ణ

పెందుర్తి: పెందుర్తిలో బుధవారం నిర్వహించనున్న బహుజన సమాజ్ పార్టీ రాజ్యాధికార బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బోను కృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సభలో పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చిస్తామని చెప్పారు. కార్యక్రమంలో బీఎస్పీ ప్రతినిధులు బంగారు రమణ, సవరాల రమేష్, కాకర ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

24న తూర్పు కాపు సంక్షేమ సంఘం సమావేశం

పెందుర్తి: తూర్పు కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 24న వేపగుంటలోని కృష్ణ దేవరాయ కాపు భవన్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా తూర్పుకాపు సంక్షేమ సంఘం జనరల్ కార్యదర్శి మురిపిండి సన్యాసిరావు తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్న సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చిస్తామని చెప్పారు. సంఘం ప్రతినిధులు, తూర్పు కాపులంతా హాజరు కావాలని కోరారు.

మహాధర్నా పోస్టర్ విడుదల

పరవాడ: విజయవాడలో కార్మిక, రైతు సంఘాల పిలుపు మేరకు ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహించనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. పరవాడ సినిమా హాలు కూడలిలో మహాధర్నా కరపత్రాన్ని మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రాల్లో కొత్తగా ఏర్పడనున్న ప్రభుత్వాలు నూతన విధానాలు అనుసరించడానికి భయపడేలా కార్మికులు, రైతులు ఐక్యపోరాటాలు సాగించాలన్నారు. విజయవాడలో జరిగే మహాధర్నాలో రైతులు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని గనిశెట్టి కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.నాయుడు, బి.శ్రీను, ఆర్.ఎస్.నాయుడు, బి.సింహాచలం, ఎం.గురునాథరావు, జి.అప్పారావు పాల్గొన్నారు.



నేడు: విస్తరణ తర్వాత కళకళలాడుతున్న సుజాతనగర్ ప్రధాన రోడ్డు (ఇన్‌సెట్) నాడు: గుంతల మయంగా సుజాతనగర్ రోడ్డు



నేడు: బీఆర్‌టీఎస్ రహదారి నుంచి పూర్తిగా విస్తరణ జరిగిన పులగానివానిపాలెం రోడ్డు (ఇన్‌సెట్) నాడు: అధ్వానంగా ఉన్న రోడ్డు



నేడు: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్ద సుందరంగా పులగానివానిపాలెం రోడ్డు (ఇన్‌సెట్) నాడు: ఇరుగ్గా ఉన్న రోడ్డు



దశాబ్దాల కల.. సాకారమైన వేళ

'సుజాతనగర్ ముఖ ద్వారం నుంచి సీ–2 జోన్ వరకు దాదాపు 15 కాలనీల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రోడ్డు పూర్తిగా గోతుల మయం కావడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. ఎమ్మెల్యే అదీప్‌రాజ్ చొరవతో ప్రభుత్వం ఈ రోడ్డు నిర్మాణం చేసింది. ఇప్పుడు ఎలాంటి ఇబ్బంది లేకుండా రాకపోకలు సాగిస్తున్నాం' సుజాతనగర్ వాసి రమణ అభిమతం.

పెందుర్తి పాత ప్రభుత్వాస్పత్రి నుంచి పులగానివానిపాలెం వెళ్లాలంటే ట్రాఫిక్‌లో చిక్కుకొని నరకం చూసే వాళ్లం. ఓ వైపు వాహనాల రద్దీ..మరోవైపు ఇరుకు రోడ్డు. అడుగడుగునా గోతులతో చాలా అవస్థలు పడేవాళ్లం. మా సమస్యను సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తెలుసుకుని వెంటనే రోడ్డు వేయడానికి జీవీఎంసీ ద్వారా నిధులు విడుదల చేశారు. ఇప్పుడు రోడ్డు వెడల్పు అయ్యి చాలా సౌకర్యవంతంగా ప్రయాణం చేస్తున్నాం' సూర్యనగర్‌కు చెందిన ప్రవీణ్ ఆనందం ఇది.

- సుజాతనగర్–సీ–2జోన్ పార్కు వరకు రూ.2.99 కోట్లతో రహదారి
- రూ.1.98 కోట్లతో పెందుర్తి–పులగానివానిపాలెం రోడ్డు నిర్మాణం
- 15 ఏళ్ల నుంచి ఈ ప్రాంత వాసుల ఎదురుచూపులు
- ఎమ్మెల్యే అదీప్‌రాజ్ చొరవతో నిధులు విడుదల చేసిన సీఎం వైఎస్ జగన్

పెందుర్తి: జీవీఎంసీ విలీన ప్రాంతాల్లో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నడుం బిగించింది. ముఖ్యంగా ప్రజలకు ఎంతో అవసరమైన రహదారుల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించింది. పెందుర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో ఇప్పటికే ప్రధాన రహదారుల నిర్మాణం/మరమ్మతు పనులు చాలా వరకు పూర్తయ్యాయి. ఈ క్రమంలో జీవీఎంసీ 96, 97వ వార్డులో ఎంతో ప్రాధాన్యత కలిగిన రోడ్లను ప్రభుత్వం నిర్మించింది. దాదాపు పుష్కర కాలంగా అభివృద్ధికి నోచుకోని సుజాతనగర్ బీఆర్‌టీఎస్ రహదారి నుంచి సీ–2 జోన్ వరకు ఉన్న రోడ్డు, దాదాపు రెండు దశాబ్దాలుగా ప్రజలకు కలగా ఉన్న పెందుర్తి బీఆర్‌టీఎస్ రహదారి నుంచి పులగానివానిపాలెం రోడ్డు అత్యంత సుందరంగా మారాయి. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఏడాది కిందట ఈ రోడ్ల దుస్థితిని నేరుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. అదే సమయంలో 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు కావడంతో నియోజకవర్గానికి దాదాపు రూ.2.99 కోట్లు కేటాయించారు. ఆ నిధులను సుజాతనగర్ రోడ్డుకు కేటాయించాలని అధికారులకు ఎమ్మెల్యే అదీప్‌రాజ్ సూచించారు. అలాగే పెందుర్తి బీఆర్‌టీఎస్ రహదారి–పులగానివానిపాలెం రోడ్డుకు రూ.1.98 కోట్లు జీవీఎంసీ నుంచి కేటాయించాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. ఇప్పుడు ఆయా రోడ్లపై ప్రజలు హాయిగా ప్రయాణం సాగిస్తున్నారు.

ఎంతో ఉపయోగం

పెందుర్తి ప్రాంతంలో అత్యంత కీలకమైన సుజాతనగర్ మార్గం గుండా దాదాపు 15 కాలనీల ప్రజలు రాకపోకలు సాగిస్తారు. దాదాపు 1.5 కిలోమీటర్ల పొడవున్న ఈ ఇరుకు రోడ్డు 40 అడుగుల రోడ్డుగా విస్తరణ జరిగింది. మరోవైపు పెందుర్తి పట్టణంలో అత్యంత కీలకమైన పెందుర్తి–పులగానివానిపాలెం రోడ్డులో ప్రశాంతినగర్, పులగానివానిపాలెం, సూర్యనగర్, నల్లక్వారీ, నరవవానిపాలెం, మహాలక్ష్మినగర్, జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీ, మొండిబంద వాసులతో పాటు పెందుర్తి మండలం జుత్తాడ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు ప్రధాన రోడ్డు ఇదే. 30 అగుడులుగా ఉన్న ఈ రోడ్డు 40 అడుగుల మేర విస్తరణ జరగడంతో తమ కష్టాలకు చెల్లుచీటి పడిందని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

హామీ ఇచ్చారు.. నెరవేర్చారు

సుజాతనగర్–సీ–2 జోన్, పెందుర్తి–పులగానివానిపాలెం రహదారుల సమస్య పంచాయతీలు ఉన్నప్పటి నుంచీ ఉంది. 2014 ఎన్నికల సమయంలో టీడీపీ నాయకులు ఈ రహదారి విస్తరణకు హామీ ఇచ్చి గెలిచిన తర్వాత గాలికి వదిలేశారు. అయితే 2019 ఎన్నికల సమయంలో ఈ రోడ్లు నిర్మాణం చేసి తీరుతామని ఎమ్మెల్యేగా పోటీ చేసిన అదీప్‌రాజ్ ప్రజలకు హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ఈ రోడ్ల నిర్మాణం కోసం నేరుగా సీఎం వైఎస్ జగన్ సహకారం కోరారు. ఈ క్రమంలో నిధులు మంజూరు చేయడంతో పాటు రోడ్లు అభివృద్ధి చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నేడు: సుజాతనగర్ ముఖద్వారం వద్ద సుందరంగా రోడ్డు (ఇన్‌సెట్) నాడు: అధ్వానంగా ఉన్న రోడ్డు

ప్రజల తరఫున కృతజ్ఞతలు



పెందుర్తి బీఆర్‌టీఎస్–పులగానివానిపాలెం రోడ్డు అభివృద్ధి చేయాలనే దాదాపు 20 ఏళ్లుగా ఉంది. గత ప్రభుత్వ పెద్దలు ఈ రహదారిని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చి కనీసం పట్టించుకోలేదు. అయితే అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఈ రోడ్డు నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించారు. రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. వేలాది మంది ప్రజల ఇబ్బందులను గుర్తించి సమస్య పరిష్కరించిన సీఎం వైఎస్ జగన్‌కు, ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు ధన్యవాదాలు.

– కిల్లి అప్పారావు, పులగానివానిపాలెం.

పంచాయతీగా ఉన్నప్పటి నుంచీ..



సుజాతనగర్‌తో పాటు దాదాపు 15 కాలనీల ప్రజలు ఈ రోడ్డులో ప్రయాణం చేస్తుంటారు. పంచాయతీగా ఉన్నప్పటి నుంచి ఈ రోడ్డు నిర్మాణం కోసం పోరాటం చేస్తున్నాం. ఎన్ని ప్రభుత్వాలు మారినా ఫలితం లేదు. పుష్కరకాలంగా మేము చేయని ప్రయత్నం లేదు. తాజాగా రోడ్డు నిర్మాణం కోసం ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ద్వారా ప్రభుత్వానికి విన్నవించాం. వెంటనే నిధులు మంజూరు చేసి మా రోడ్డును పూర్తి చేశారు. పంచాయతీ కాలం నాటి కల ఇప్పుడు నెరవేరింది. ప్రభుత్వానికి, ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు కృతజ్ఞతలు.

– డి.ఎస్ మూర్తి, సుజాతనగర్ కాలనీ అసోషియేషన్ కార్యదర్శి.

ప్రజల చెంతకే సంక్షేమం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, పాల్గొన్న గ్రామస్తులు

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- అంతకాపల్లిలో వై ఏపీ నీడ్స్ జగన్

సబ్బవరం: ప్రజలు గతంలో ప్రభుత్వ పథకాలు,సేవల కోసం నాయకులు,అధికారుల చుట్టూ తిరిగేవారు... వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పథకాలు అందించేందుకు నాయకులు,అధికారులు ప్రజల చుట్టూ తిరుగుతున్నారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. మండలంలోని అంతకాపల్లి సచివాలయం పరిధిలో మంగళవారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే, పల్లెకు పోదాం కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలతో పాటు చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసి చరిత్ర సృష్టించారన్నారు. దీంతో ప్రభుత్వం అధికారం చేపట్టి నాలుగున్నర సంవత్సరాలు గడుస్తున్నా ధైర్యంగా ప్రజల్లో తిరుగుతున్నామని చెప్పారు.

బాబువి మోస పూరిత హామీలు

చంద్రబాబు మోసపూరిత హామీలతో ప్రజలను మోసం చేయడం తప్పా చేసిందేమీ లేదని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత గ్రామంలో సుమారు రూ.38 కోట్లతో సంక్షేమ పథకాలు అందించడంతో పాటు గ్రామాన్ని సమగ్రంగా అభివృద్ధి చేశామని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రజలంతా మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. సచివాలయం వద్ద ప్రభుత్వం అందించిన సంక్షేమ,అభివృద్ధి పథకాల వివరాలతో ఏర్పాటు చేసిన బోర్డును ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి,సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్,పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు, పార్టీ జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు కొటాన రాము, నాయకులు సబ్బవరపు ముత్యాలనాయుడు,ఈవోఆర్‌డీ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇళ్ల మరమ్మతులకు దరఖాస్తులు

- ఆన్‌లైన్‌లో అనుమతులు మంజూరు
- భక్తుల సలహాలు, సూచనల కోసం వాట్సాప్ నంబర్
- సింహాచలం దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి



సింహాచలం దేవస్థానం సమాచారం తెలిసేలా రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఈవోశ్రీనివాసమూర్తి

సింహాచలం: ప్రభుత్వం ఇచ్చిన మెమో ప్రకారం పంచగ్రామాల వాసులు ఇళ్ల మరమ్మతులు చేసుకునేందుకు బుధవారం నుంచి సింహాచలంలోని కొండదిగువ శ్రీదేవి కాంప్లెక్స్‌లో దరఖాస్తులు అందజేయనున్నట్లు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. దేవస్థానం కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో ఇళ్ల రిపేర్లకు సంబంధించి తీసుకున్న చర్యలతో పాటు కొత్తగా తీసుకున్న నిర్ణయాలు, ఉత్సవాల సందర్భంగా చేస్తున్న ఏర్పాట్లను వివరించారు. ఇళ్ల రిపేర్లకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన మెమోకి లోబడే మరమ్మతులు చేసుకుంటామని దరఖాస్తుదారులు హామీ పత్రం సమర్పించాల్సి ఉంటుందన్నారు. గురువారం నుంచి వెబ్‌సైట్ ద్వారా కూడా దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకుని నింపిన తర్వాత నేరుగా అందజేయాలని తెలిపారు.

23 నుంచి దరఖాస్తుల స్వీకరణ

ఈనెల 23 నుంచి శ్రీదేవి కాంప్లెక్స్‌లోనే దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. వివరాలను దేవస్థానం సిబ్బంది కంప్యూటర్ నమోదు చేసుకుని దరఖాస్తుదారునికి రశీదు ఇవ్వడం జరుగుతుందన్నారు. దరఖాస్తులకు ఇచ్చిన నంబరు ప్రకారం పదిరోజుల తర్వాత అప్రూవ్ అయిందా...లేదా అని కూడా చూసుకునేలా వైబ్‌సైట్ రూపొందిస్తున్నామన్నారు. వచ్చిన దరఖాస్తుల ఆధారంగా క్షేత్ర స్థాయిలో పరిశీలించిన తర్వాతే అనుమతులు మంజూరవుతాయని స్పష్టం చేశారు. మెమోను సాకుగా తీసుకుని ఎలాంటి అదనపు నిర్మాణాలు చేపట్టినా దేవదాయశాఖ 1983 సెక్షన్ ప్రకారం నోటీసులు ఇచ్చి తొలగించడం జరుగుతుందన్నారు.

భక్తులకు చేరువగా సమాచారం

దేవస్థానంలో సేవలు, ఇతర సమాచారం పూర్తిగా తెలిసే విధంగా ఎనిమిది పేజీలతో రూపొందించిన కరపత్రాన్ని భక్తులందరికీ అందిస్తామని ఈవో తెలిపారు. అందులో సింహాచలం క్షేత్ర మహత్యం, దర్శనాల సమయాలు, దర్శనీయ స్థలాలు, ప్రధాన వార్షిక ఉత్సవాలు, ఆర్జిత సేవలు, ఉపాలయాలు తదితర వాటి వివరాలు ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, డీఈ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

- భక్తుల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించడానికి వాట్సాప్ నెంబర్ 9398734612ని అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు.
- ఇకపై దేవస్థానంలో ఏఈవోలు, సూపరింటెండెంట్లు, పీఆర్వోకు కొత్తగా నంబర్లు కేటాయించినట్టు తెలిపారు. అధికారులు మారినా ఆనెంబరు మారదన్నారు.
- భైరవవాక రోడ్డు విస్తరణ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు.
- స్వామివారి ఆర్జిత సేవలను పరోక్షంగా చేసుకునే విధంగా ఈనెల 12న స్వాతి నక్షత్రంతో మొదలు పెట్టామని చెప్పారు.
- ఈనెల 26 నుంచి 41రోజుల నృసింహ దీక్ష, డిసెంబరు 4 నుంచి 32 రోజుల నృసింహ దీక్ష ప్రారంభమవుతుందన్నారు.
- ఈనెల 27న కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని సాయంత్రం 5గంటలకు కొండదిగువ వరాహ పుష్కరిణి వద్ద గంగా హారతి నిర్వహిస్తున్నట్టు తెలిపారు. భక్తులకు దేవస్థానంలో ఉన్న ఆవులపేడతో తయారు చేసిన ప్రమిదలు, నూనె దేవస్థానం ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు.
- ఈనెల 27 నుంచి 29వరకు సింహగిరి క్షేత్రపాలకుడు త్రిపురాంతకస్వామి ఆలయంలో వరుణాభిషేకం నిర్వహించనున్నారు.
- డిసెంబరు 12న పోలిపాడ్యమిని పురస్కరించుని కొండదిగువ వరాహ పుష్కరిణి వద్ద గజ ఈతగాళ్లు, సెక్యూరిటీ సిబ్బందిని నియమించనున్నట్టు తెలిపారు.
- సింహగిరిపై కొత్త మండపాన్ని నిర్మించి ప్రతి శనివారం సహస్ర దీపాలంకరణ చేపట్టేందుకు ప్రణాళిక చేస్తున్నట్లు తెలిపారు. అలాగే గ్రామ గరుడసేవ కూడా ప్రారంభించే యోచన చేశామన్నారు.

సంక్షేమానికి చిరునామా వైఎస్ జగన్

ఎంపీపీ మధుపాడ నాగమణి

పెందుర్తి: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు పక్కాగా అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎంపీపీ మధుపాడ నాగమణి అన్నారు. నవరత్నాల పేరుతో లబ్ధిదారులకు ఇంటికే పథకాలు అందిస్తూ సంక్షేమానికి చిరునామాగా నిలిచిన వైఎస్ జగనే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలంతా కోరుకుంటున్నారన్నారు. పెందుర్తి మండలం సరిపల్లిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ నాగమణి మాట్లాడుతూ ప్రతీ గడపకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉన్నారని..రానున్న ఎన్నికల్లో ప్రతీ ఇంటిపై వైఎస్సార్ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. సీఎం వైఎస్ జగన్ నాలుగున్నరేళ్ల పాలనలో పార్టీలు కులమతాలకు అతీతంగా ప్రతీ ఇంటికి మేలు జరిందన్నారు.దీంతో ఏ ఇంటికి వెళ్లినా రాష్ట్రానికి మళ్లీ జగనే కావాలని ఆకాంక్షిస్తున్నారని వెల్లడించారు. అనంతరం 'వై ఏపీ నీడ్స్ జగన్' బుక్‌లెట్‌లు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ ఉప్పిలి దేవి, ఎంపీటీసీ సభ్యుడు గొల్లవిల్లి రమణ, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గొరపల్లి శ్రీను, సరిపల్లి ఉప సర్పంచ్ హేమంత్ పాల్గొన్నారు.



సరిపల్లిలో బోర్డు ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

బస్సు యాత్రను విజయవంతం చేయండి

పెందుర్తి: సబ్బవరంలో ఈ నెల 25న జరగనున్న సామాజిక సాధికార బస్సుయాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పిలుపునిచ్చారు. రాంపురంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం పెందుర్తి ప్రాంత నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పదవీ బాధ్యతలు తీసుకున్న తర్వాత ఎస్సీలు, బీసీలు, మైనార్టీలకు నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం అందించిన సంక్షేమ, అభివృద్ధి ఫలాలను వివరించాలన్న ఉద్దేశంతో ఈ బస్సు యాత్ర చేపట్టామన్నారు. పలు అంశాలపై చర్చించారు. సర్పంచ్ అన్నంరెడ్డి శిరీష, వార్డు మెంబర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్, చిత్రంలో సర్పంచ్ శిరీష

గుర్తు తెలియని మృతదేహం గుర్తింపు

పెందుర్తి: పెందుర్తి సమీపంలోని అనకాపల్లి–ఆనందపురం రోడ్డు పక్కన ఓ గుర్తు తెలియని మృతదేహాన్ని మంగళవారం స్థానికులు గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సుమారు 55–60 ఏళ్ల వ్యక్తి రోడ్డు పక్కన పడి ఉండడాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు నీలం రంగు చొక్కా, నీలం రంగు షార్ట్, నలుపు రంగు బనియన్‌తో ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్ తరలించారు. వివరాలు తెలిసిన 0891–2764233 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు. సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏఎస్ఐ బాబూరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు

పరవాడ: అవినీతికి ఆస్కారం లేకుండా రాజకీయాలు, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకోవడానికి ప్రజలు ముందుకు రావాలని ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. వాడచీపురుపల్లిలో వైస్ ఎంపీపీ బి.అప్పలరాజు, లంకెలపాలెం పీఏసీఎస్ చైర్మన్ బురదరాజు, ఎంపీటీసీ గెడ్డం పుష్పా చంద్రారావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆమె పాల్గొని డిజిటల్ బోర్డు ఆవిష్కరించారు. అనంతరం మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు గ్రామ సచివాలయం ఎదుట వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి గ్రామంలో గడపగడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో కూండ్రపు తాతాజీ, కూండ్రపు ఉమా మహేశ్వరి, నాయకులు పి.ప్రసాద్, పైల అప్పలనాయుడు, కె.సోమునాయుడు పాల్గొన్నారు.



డిజిటల్ బోర్డు ఆవిష్కరించిన ఎంపీపీ వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు